# నమ్మిన బంటు

M వ. చలం.

వాడున్నాడే—సన్నగా, నల్లగా, పొట్టిగా, లోతుకుపోయిన కళ్లవాడు; బలేవిశ్వాస పాత్రుడైన సేవకుడు. ఆ పెరిగిన గడ్డంలో వాడి బుగ్గలు బూరెల్లా పొంగివున్నాయనుకునేరు. అవి బలేబాగా లోపలికి పోయి దంతాలను తంతున్నాయి. వాడు గడ్డం పెంచటానికి కారణం వాడిభార్య గర్భిణితో వుండికాదు; వాడి యజమానుని కొడుకు పెళ్లి తీరిక లేకుండా చేసింది.

ఆ యెత్తుగావున్న మూడంతస్తుల మబ్బురంగు మేడలోనే వాడు పనిచేస్తోంట. ఆ యింటియజమానునికి చిన్నతనంలో మబ్బుల్లో విహరించాలనే కోర్కెబలంగావుండి సాధ్యంకాక తను విహరించే మేడకు మబ్బుల్ని—కాదు మబ్బు రంగును పూయించాడు.

చాలామంది ధనవంతులు నమ్మకమైన సేవకులు దొరక్క వాడికోసం పోటీలు పడ్డారు. అడిగినంత జీతం యిస్తామన్నారు. కాని వాడు 'ససేమిరా' అన్నాడు. పాపం వాళ్లు నిరాశపడి విశ్వాసంగల సేవకులు లేనిలోటు తీర్చుకొందుకు కుక్కలను పెంచసాగారు.

ఆ మేడలో వాడికి వంటవండేపని దగ్గర నుంచి, యజమానుని పాదాలువత్తి నిద్రపుచ్చేవరకు పనంతా వాడిదే! నేనింత పని చేస్తున్నాననీ, నాకింత జీతం కావాలని కోరి వాడెప్పుడూ యజమానికి నొప్పికలిగించలేదు. ఆయన చెప్పినంతపని చేసియిచ్చినంత తీసుకుపోతాడు.

వాడెప్పుడూ యితరులతో అనవసరంగా మాట్లాడడు. ఎప్పుడైనా మాట్లాడితే ఆ మాటలకు కావలసినంత గర్వం పూత పూసి వుంటుంది. ఎప్పుడు యెవరితో మాట్లాడినా వాడు యీ మాటలకంటె యెక్కువ మాట్లాడడు—

"మా మేడనుమించిన మేడ యీ వూళ్లో యెవరికి వుంది? ఆ గాలి పంకాలు, ఆ గాజుదీపాలు, ఆ రాతిబొమ్మలు. అంతా స్వర్గంలోవున్నట్టే వుంటుంది అక్కడవుంటే! మా అమ్మగారి మెడలో వుండే నగలు యెంత అందంగావుంటాయి. అబ్బ! అన్ని నగలు ఆమె గనక మోస్తోంది. గాని మరో పేదరాలు బక్కచిక్కిన మెడ అయితే విరిగి వూరుకోవలసిందే! అందుకే దేవుడు పేదవాళ్లకు డబ్బివ్వడు. మా యజమాని యెంతదయగలవాడు. ఆయన పుణ్యమా

అని యెందరు పనిచేసుకు బ్రతుకుతున్నారు. ఆయనకు కోపంవచ్చి కన్ను తెరిస్తే వాళ్లంతా ఆకలితో మల మల మాడిచస్తారు!'' ఈ ధోరణిలో వుండేవి వాడిమాటలు.

యజమానికి కూడా వాడంటే చాలా ప్రేమ. అలాంటి సేవకుడు పోతేతిరిగి అలాంటివాడు దొరకడని ఆయనకు బాగా తెలుసు. అందువల్ల వాడుపోకుండా జాగ్రత్తగా అదుపులో పెడుతూవచ్చాడు. చాలా మంది సేవకులు ఆయన దగ్గర పెద్ద జీతాల పుచ్చుకుని కొంతసొమ్ము పోగయ్యాక నౌకరీ వదిలిపోయి ఆయన్ని దగాచేశారు. అలాంటి ప్రమాదం జరక్కుండా వీడికి చాలాస్వల్ప జీతంయిస్తూ వాడిమీద ప్రేమను పెంచుకున్నాడు.

ఒకసారి వాడి భార్యకు జబ్బుచేసింది. ఆ సంగతి యజమానికి నివేదించుకున్నాడు. యజమాని ''అదే తగ్గుతుందిలే—' అన్నాడు. ''డాక్టరు బాబుతో మందు యిప్పించకుండానే తగ్గుతుందా బాబు గారూ;'' అన్నాడు వాడు.

''డాక్టరు డబ్బున్న వాళ్లకి గాని నీకెందుకురా:'' అంటూ ఒకరూపాయతీసి వాడిమీద గిరవాటు వేసి ''పోయి నాటువైద్యం చేయించు—'' అన్నాడు యజమాని. వాడు ఆనందంతో రూపాయి పుచ్చుకుపోయి నాటువైద్యుడితో మందు యిప్పించాడు. కాని దేవుడు దయ తప్పటంవల్ల వాడి యిల్లాలు చచ్చిపోయింది. వాడు. 'మళ్లీ పెళ్లి' చేసుకోకుండా కాలమంతా యజమాని స్వర్గ సౌధంలోనే గడుపుకొస్తున్నాడు.

కొన్నాళ్ళతరువాత వాడి యజమానికి క్షయవ్యాధి వచ్చింది. చాలారోజులు ఆయన మంచాన తీసుకున్నాడు. క్షయ అంటువ్యాధి కావటంవల్ల తమకుకూడా, యెక్కడ అంటుకుంటుందోనని భయపడి భార్యగాని, కొడుకుగాని, కోడలుగాని, ఆ ప్రక్కను రావటం మానుకున్నారు. ఆయన సేవంతా—కళ్లెపట్టటం దగ్గఱ నుంచి మలమూత్రాలు యెత్తివేయటం దాకా వాడిమీదనే జరిగింది. ఒకనాటి దుస్సమయాన ఆయన యింటివారందరినీ దుఃఖంలో ముంచి యిహలోకలీల చాలించారు.

చనిపోయేముందు యెదురుగా నిలబడివున్న సేవకుడివంక చూసి ప్రేమతో యిలా అన్నాడు. ''నాయనా! నువ్వు నా కొడుకుకంటె అధికుడవోయి. యీ ఆస్తిఅంతా నీకు వ్రాసియిచ్చినా నాఋణం తీరదు. కాని ఏంచేయను? కొంతఆస్తి నీకు ముట్టచెప్పాలని వుందిగాని-నీవంటి సేవకుడే నా కొడుకుకు దొరకడోయ్! '' అంటూ కన్నుమూశాడు.

యజమాని వాణ్ణి వదిలిపోయినా వాడు యజమానిని వదలలేదు. కొన్నాళ్ళ తరువాత వాడు కూడా క్షయవ్యాధి తెచ్చుకుని, మరికొన్నాళ్లు బాధపడి, పరలోకాన వున్న యజమానికి సేవ చేయటానికి ప్రయాణంకట్టాడు.